క్లుప్తంగా

గృహ నిర్మాణాలపై సర్వే చేయండి



ఆన్‌లైన్లో పొందుపరుస్తున్న వివరాలు పరిశీలిస్తున్న డీఈఈ

సారవకోట: మండలంలోని గిరిజన గ్రామాల్లో గృహ నిర్మాణాలపై సర్వే చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ డీఈఈ రామ్మూర్తి సూచించారు. మండల కేంద్రంలోరి గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం చేపట్టారు. ఐటీడీఏ ద్వారా మండలానికి 250 గృహాలు మంజూరయ్యాయని, ఎవరికైతే గృహాలు అవసరమో గుర్తించాలన్నారు. అటువంటి వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్లో పొందుపర్చాలన్నారు. ప్రస్తుతం మండలంలో 50 గృహాలకు సబంధించి సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు.

గ్రానైట్ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ చోడసముద్రంలోని సర్వే నంబర్ 51లో గ్రానైట్ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని తహసీల్దార్ హనుమంతరావుకు గ్రామస్తులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సర్వే నంబర్లో 40 సంవత్సరాలుగా జీడి, మామిడి, కంది, టేకు తదితర పంటలను సాగు చేస్తున్నామని, డీ పట్టాలు ఉన్నాయన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ డీ పట్టాలకు సంబంధించిన డాక్యుమెంట్లు తన కార్యాలయానికి అప్పగించాలన్నారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేట్లు బాధ్యతగా పనిచేయాలి



మేట్లకు శిక్షణ ఇస్తున్న ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనులు చేసే టప్పుడు మేట్లు బాధ్యతగా మెలగాలని టెక్కలి ఏపీడీ శైలజ అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ఉపాధి మేట్లకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి పలు విషయాలను వివరించారు. ఉపాధి పనుల్లో మేట్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వేతనదారులకు పని దినాల కల్పనకు దగ్గరగా ఉన్న వేతనదారులను తప్పనిసరిగా పనిలోకి తీసుకురావాలన్నారు. సమయపాలన పాటిస్తూ.. నిర్దిష్ట వేతనాలు అందేలా కొలతలు ఇచ్చి, మస్టర్ నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. పనికి హాజరైన ప్రతీ వేతనదారునికి హాజరువేయాలన్నారు. ఏపీఓ రవి, సాంకేతిక సహాయకులు ఎం.తిరుపతిరావు, క్షేత్ర సహాయకులు భాస్కరరావు, కె.సింహాచలం పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్‌తో అధిక దిగుబడులు



బూర్జలో జీరో టిల్లేజ్ విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

సరుబుజ్జిలి: మొక్క జొన్న పంటను జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యపడతాయని బూర్జ మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఓవిపేట, మామిడివలస, కొల్లివలస, గంగంపేట కాంఖండ్యాం గ్రామల్లో గురువారం పర్యటించి జీరో టిల్లేజ్ విధానంలో పండించే మొక్క జొన్నపంటను పరిశీలించారు. ప్రతీ రైతు మొక్కజొన్న పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వసంతరావు, రెడ్డీస్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ ఏసు బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక తిరుమల వీధి వద్ద ఉన్న విజయలక్ష్మి జ్ఞానసరస్వతి సమేత వరసిద్ధి వినాయక దేవాలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు భాస్కరబట్ల జగదీష్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



రామదాసుపురంలో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రామదాసుపురం, కనిమెట్ట, దళ్లవలస గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌లోగా భాగంగా ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. రామదాసుపురంలో రూ.26.70 లక్షలు, కనిమెట్టలో రూ.1.20 కోట్లు, దళ్లవలసలో రూ.85 లక్షల నిధులతో కుళాయిల నిర్మాణం చేపడతామన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లోనూ రోడ్లు, మురుగు కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరిగిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ మద్దతుగా నిలవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లన సూర్యారావు, కిల్లి నాగేశ్వరరావు, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, కాకర్ల రాజారావు, వందాన సూరపునాయుడు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, సూర భాస్కరరావు, నాని, పైడి అప్పలనాయుడు, బొడ్డేపల్లి రామారావు, అప్పారావు, కూన అన్నంనాయుడు, అన్నెపు ముకుందరావు, బొడ్డేపల్లి శంకరావు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై దృష్టి సారించండి

● ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ ప్రసాదరావు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి ప్రసాదరావు

పోలాకి: ప్రభుత్వం ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం లోని వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులపై దృష్టి సారించాలని జిల్లా నోడల్ అధికారి ఎం.ప్రసాదరావు వైద్య సిబ్బందికి సూచించారు. రాళ్లపాడులోని వైద్య శిబిరాన్ని గురువారం తనిఖీ చేశారు. రోగుల వివరాల నమోదు, వారికి కేటాయించిన పోర్టల్ ద్వారా మందుల సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌సీడీసీ కార్యక్రమాన్ని ఆశ కార్యకర్తల ద్వారా రోజుకు 20 ఇళ్లల్లో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇంటిలోని ప్రతి ఒక్కరినీ పరిశీలించి వారి వివరాలు నమోదు చేస్తున్నట్లు వివరించారు. కుష్టు వ్యాధిపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించటం ద్వారా మాత్రమే వ్యాధి నిర్మూలన జరుగుతుందన్నారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ దీప

సరుబుజ్జిలి: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల పరిషత్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందని బూర్జ ఎంపీపీ కర్నేని దీప తెలిపారు. బూర్జ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మండల బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఎంపీడీఓ ఎం.రవీంద్ర బాబు గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఎంపీపీతోపాటు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు ఆమోదం తెలిపారు.

మండల పరిషత్ సాధారణ నిధులు రూ.26. 55 లక్షలు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. సామాజిక అభివృద్ధి, జీత భత్యాలు కింద రూ.1.12 కోట్లు ఖర్చుచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేకాహ్వానితుడు కర్నేని నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎంపీపీ కూర్మినాయుడు

సారవకోట: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు తెలిపారు. మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ సింగంవలస గ్రామంలో పలు శాఖల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలు సరిచేయాలని, మురుగు నీటి కాలువలు నిర్మించాలని, గ్రామంలో 20 మంది విద్యార్థులున్నారని, పాఠశాలను పునః ప్రారంభించాలని కోరారు. ఈ సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపీపీ సూచించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నాల వెంకట సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ రమేష్, సచివాలయ సిబ్బంది, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు



మిల్లు యజమానితో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

సరుబుజ్జిలి: ధాన్యం సేకరణ విషయంలో మిల్లుల యజమానులు ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని బూర్జ తహసీల్దార్ సనపల రమణారావు హెచ్చరించారు. బూర్జ మండలం డొంకలపర్త గ్రామ సమీపంలో గల ధాన్యం మిల్లును గురువారం తనిఖీ చేశారు. మిల్లుకు ధాన్యం తెస్తున్న రైతుల నుంచి అదనపు ధాన్యం ఇస్తే తప్ప అన్‌లోడ్ చేసే ప్రసక్తేలేదని పలువురు రైతులు ఫిర్యాదు చేశారన్నారు. మిల్లు యజమానిపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల వద్ద నుంచి సమాచారం తీసుకుని, పూర్తి విచారణ చేపట్టి మిల్లు యజమానిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. సరకు వచ్చిన వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న హెచ్ఎం రామ్మూర్తి

పాతపట్నం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.రామ్మూర్తి అన్నారు. పాఠశాలలో 9, 10వ తరగతి చదుతున్న విద్యార్థులందరికీ రూ.వెయ్యి చొప్పున హైదరాబాద్‌కు చెందిన ఉల్లాస్ సంస్థ సమకూర్చిన నగదు ప్రోత్సాహకాన్ని గురువారం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యుడు ప్రసన్నకుమార్, గిరి, ఎం.సింహాచలం, మధుసూదనరావు, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా గ్రంథాలయానికి ఇదే మండలం తురకపేట సెంటర్‌కు చెందిన జియో సైంటిస్ట్ పంపన శ్రీనివాసరావు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గురువారం వితరణగా ఇచ్చారు.

విద్యార్థులు గ్రూప్–2 ప్రవేశ పరీక్షకు ఉపయోగపడే పలు రకాల పుస్తకాలు అందజేశారని టెస్ సంస్థ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు అనేక ఇబ్బందులు పడుతుంటారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉండాలని వీటిని అందజేశారన్నారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



జాన్‌వెస్లీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గుడివాడ జాన్‌వెస్లీ నవోదయ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపిక అయ్యారని పాఠశాల ఉపాధ్యాయలు ఎస్.ఆజీమ్, కె.సింహాచలం గురువారం తెలిపారు. హిరమండలానికి చెందిన విద్యార్థి బొర్రంపేట పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు. నవోదయ రెండో జాబితాలో జాన్‌వెస్లీ ఎంపిక య్యారని చెప్పారు.

పక్కాగా ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి నగేష్

జలుమూరు: ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి, నరసన్నపేట నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి బి.నగేష్ అన్నారు. జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫారం 6, 7, 8 దరఖాస్తులు గురువారం పరిశీలించారు. చేర్పులు, తొలగింపు, బదిలీ ఓటర్లకు సంబంధించి పూర్తిస్థాయి పత్రాలను పరిశీలించారు. మృతి చెందిన వారి ఓట్లు, రెండు చోట్ల ఉన్న ఓట్లు తొలగించాలన్నారు. తహసీల్దార్ బి.సత్యం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి మండలంలోని 36 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. గత 15 రోజులుగా మెగా రక్షిత తాగునీటి పథకం మరమ్మతులకు గురైంది. గురువారం పనులు పూర్తిచేసి తాగునీరు అందించేందుకు సిద్ధం చేయగా.. లక్ష్మీనర్సుపేటలో తాగునీటి పైపులైన్‌లు లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోయింది. మెగా తాగునీటి పథకం ద్వారా తరచూ లీకులు అవుతున్నాయని సర్పంచ్ ముగడ దివాకర్‌తోపాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకులు లేకుండా పూర్తి స్థాయిలో శాశ్వత చర్యలు చేపట్టాలని పలు గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

పోలాకి: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగి నాయుడు గురువారం తెలిపారు. ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఐదు మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు: మండలంలోని మాతల సమీపంలో రేగిడి ఆమదాలవలస మండలం ఖండ్యాం గ్రామానికి చెందిన పి.సాయికృష్ణ వద్ద ఐదు ఒడిశా మద్యం సీసాలను గురువారం స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.ఎ.హమ్మద్ తెలిపారు. సాయికృష్ణను అరెస్టు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం, దేవాది సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టెక్కలి ఈఈ శంకరరరావు గురువారం తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొత్తూరు మండలంలో రేపు..

కొత్తూరు: ఈ నెల 30వ తేదీన మండల కేంద్రంలోని 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏఈ కె.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు, కర్లెమ్మ, పారాపురం, మహసింగి తదితర గ్రామాల పరిధిలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



సరుబుజ్జిలి: బూర్జలో క్రీడాకారులకు టీషర్ట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

క్రీడలతో మానసిక ఉల్లాసం



సారవకోట: వాండ్రాయిలో క్రికెట్ ఆడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

సరుబుజ్జిలి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బూర్జ ఎంపీపీ కర్నేని దీప అన్నారు. బూర్జతోపాటు పలు గ్రామ సచివాలయాల్లో గురువారం ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి మండలంలో..

సరుబుజ్జిలి మండలంలోని పాలవలస, రొట్టవలస, షళంత్రి, చినకాగితాపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: పాలవలసలో క్రీడా పోటీలకు సంబంధించి టాస్ వేస్తున్న క్రీడాకారులు

సారవకోట మండలంలో..

సారవకోట: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. వాండ్రాయి సచివాలయ పరిధిలో సర్పంచ్ గొంటి లక్ష్మణరావు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవాభావం అలవాటు చేసుకోవాలి



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: విద్యార్థుల సేవాభావం అలవాటు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్‌సాహు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రొట్టవలసలో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేయాలి

సరుబుజ్జిలి: రొట్టవలస జంక్షన్ వద్ద ఆర్టీసీ 5 స్టాప్ ఎక్స్‌ప్రెస్ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజారవాణా సంస్థ పీఆర్ఓ కృష్ణవేణికి శ్రీకాకుళం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. రొట్టవలస జంక్షన్ వద్ద బస్సులు నిలుపుదల చేయకపోవడం వల్ల సుమారు 25 గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బస్సు నిలుపుదల చేయాలని కోరారు.

వైభవంగా గ్రామ సందర్శన యాత్ర




కొత్తూరులో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి సీతారామాలయం వరకు అయోధ్య అక్షింతలను బీజేపీ ఆధ్వర్యంలో గ్రామ సందర్శన యాత్ర గురువారం నిర్వహించారు. మండలంలోని బలద, కడుము, కొత్తూరుతోపాటు పలు గ్రామాల భక్తులకు అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్షింతలను శుభ కార్యాల్లో ఉపయోగిస్తే అంతా మంచే జరుగుతుందన్నారు. అయోధ్య మందిరం జనవరి 22న ప్రారంభం అవుతున్నందున ఈ కార్యక్రమాన్ని టీవీలు, తెరల్లో తిలకించాలన్నారు. విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రముఖ్ సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి వి.ప్రసాదరావు, మండల కన్వీనర్ సి.హెచ్.నర్సింహారావు, టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల కన్వీనర్ పాగిరి రవి, జి.మన్మథరావు పాల్గొన్నారు.

గోదాంలో బియ్యం నిల్వల పరిశీలన

ఆమదాలవలస రూరల్: గోదాంలో బియ్యం నిల్వలు సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజనల్ మేనేజర్ బి.రవికుమార్ సూచించారు. ఆయన గురువారం ఆమదాలవలస మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న గిడ్డంగుల సంస్థ గోదాములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గత సంవత్సరానికి సంబంధించిన బియ్యం నిల్వలు, ఈ ఏడాది బియ్యం సేకరణ వంటి అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం రికార్డులు కూడా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్థానిక గిడ్డంగుల సంస్థ బ్రాంచ్ మేనేజర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారించాలి



డీఆర్ఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస రూరల్: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్లో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు విన్నవించారు. ఈ మేరకు స్థానిక రైల్వే స్టేషన్ పరిశీలనకు గువారం వచ్చిన డీఆర్ఎం గౌరబ్‌ప్రసాద్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. ఊసవానిపేట గేటు వద్ద ప్లైఓవర్, ఇందిరమ్మ విగ్రహం సమీపంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. గూడ్స్ షెడ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఏడీఆర్ఎం ఎస్.కె.గుప్తా తదితరులు పాల్గొన్నారు.